భోనం.. ఘనం



సచివాలయంలో బోనాల ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. మహిళా ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కళాకారులు, చిన్నారుల నృత్యాలు, విన్యాసాలు అలరించాయి. సీఎస్ శాంతికుమారి నల్ల పోచమ్మకు బోనం సమర్పించారు.



రాష్ట్రపతి నిలయానికి పర్యాటక సంస్థ ఉచిత బస్సు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి శీతాకాల విడిది అయిన బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం సందర్శకుల కోసం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రత్యేకంగా ఉచిత షటిల్ బస్సు సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. ఈ బస్సులను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. బేగంపేట యాత్రినివాస్ టూరిజం బుకింగ్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. యాత్రినివాస్, ప్యారడైజ్ మెట్రోస్టేషన్ నుంచి ప్రతిరోజూ ఉ.9 గంటల నుంచి సా.4 గంటల వరకు ప్రతి గంటకో బస్సు బయలుదేరుతుందని పర్యాటక సంస్థ అధికారులు తెలిపారు. వారాంతపు సెలవు రోజుల్లో అదనంగా సా.5గంటలకు, 6గంటలకు అదనంగా రెండు బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు..

నేటితో ముగియనున్న నిందితుల రిమాండ్

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన నలుగురు నిందితులు.. మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు జ్యుడీషియల్ రిమాండ్ నేటితో ముగియనుంది. చంచల్‌గూడ జైలులో విచారణ ఖైదీలుగా ఉన్న వీరిని శుక్రవారం నాంపల్లి కోర్టులో హాజరుపరచనున్నారు. అయితే, ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, శ్రవణ్ విదేశాల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు కోర్టుకు ఏ ఆధారాలను/వివరాలను సమర్పిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

నేడు ఫైర్‌మన్ల పాసింగ్ అవుట్ పరేడ్

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకున్న 483 మంది ఫైర్‌మన్ల పాసింగ్ అవుట్ పరేడ్ శుక్రవారం వట్టినాగులపల్లిలోని తెలంగాణ విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక సేవల శాఖ శిక్షణ కేంద్రంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అనంతరం అగ్నిమాపక శాఖలో ఇటీవల ఎంపికైన 157 మంది డ్రైవర్ ఆపరేటర్లకు నియామక పత్రాలు అందజేస్తారు.

'పార్కుల రక్షణ, పచ్చదనం ప్రభుత్వ బాధ్యత'

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాల కోసం పార్కులను రక్షించడం.. పచ్చదనం పెంపొందించడం ప్రభుత్వం, స్థానిక సంస్థల బాధ్యత అని హైకోర్టు స్పష్టం చేసింది. పార్కులను రక్షించడంతోపాటు ప్రజల హక్కులను కాపాడేలా గ్రీన్ స్పేస్ ఏర్పాటు చేయాలని కోరుతూ కే ప్రతాప్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్ దాఖలై ఎనిమిదేళ్లు అవుతున్నా అధికారులు ఎలాంటి వివరాలు సమర్పించలేదని గుర్తు చేసింది. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నామో కౌంటర్ దాఖలు చేస్తామని ఏజీ తెలపడంతో విచారణ ఆగస్టు 1కి వాయిదా పడింది.

ప్రతి నాలుగు జంటల్లో ఒకరికి సంతానలేమి

హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతి నాలుగు జంటల్లో ఒకరు సంతానలేమి సమస్య ఎదుర్కొంటున్నారని ఇన్‌ఫెర్టిలిటీ నిపుణులు వెల్లడించారు. ఈ సంఖ్య దాదాపు 1.5-2 కోట్ల మేర ఉండగా, తెలంగాణలో 15 శాతం జనాభా ఈ సమస్యతో బాధపడుతున్నట్లు వివరించారు. వరల్డ్ ఐవీఎఫ్ డే సందర్భంగా గురువారం కింగ్‌కోఠి కామినేని ఫెర్టిలిటీ ప్రాంగణంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వైద్యులు, సిబ్బందితోపాటు గతంలో ఐవీఎఫ్ విధానం ద్వారా పిల్లలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు, వారి పిల్లలు కూడా పాల్గొన్నారు. సంతానసాఫల్య చికిత్సకు వెళ్లడాన్ని ఇప్పటికీ సమాజంలో అదేదో తప్పుగా భావిస్తున్నారని పలువురు వైద్యులు అభిప్రాయపడ్డారు.

ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, అపరిశుభ్రత

● పార్ట్‌టైం మంత్రి పర్యవేక్షణ ఏది? ● ఎక్స్‌లో కేటీఆర్



హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరం సీజనల్ వ్యాధులకు నిలయంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 'పారిశుధ్య నిర్వహణ గాడి తప్పింది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. వెయ్యి స్వచ్ఛ ట్రాలీలు కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో మేయర్, జీహెచ్ఎంసీ అధికారుల ఆకస్మిక పర్యటనలు చేయడం లేదు. చెత్త తరలింపు కాగితాలకే పరిమితమైంది. పర్యవేక్షించాల్సిన పార్ట్‌టైం మునిసిపల్ మంత్రి ఎమ్మెల్యేల కొనుగోలు, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉన్నారు' అని పరోక్షంగా సీఎం రేవంత్‌నుద్దేశించి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం తన ఎక్స్ ఖాతాలో పలు విమర్శలు చేశారు.

రూ. 345.84 కోట్లు

మూడు కమిషనరేట్లకు బడ్జెట్ కేటాయింపులు

(5వ పేజీ తరువాయి)

ఈ బడ్జెట్‌లో కేటాయించారు.

- సాంకేతిక అవసరాలు, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌కు రూ. 18.45 కోట్లు
- సీసీఎస్ నిర్వహణకు రూ. 95 లక్షలు
- నేర పరిశోధన, క్రైమ్ డేటా విశ్లేషణకు రూ. 18.45కోట్లు
- స్పోర్ట్స్ మీట్‌కు అయ్యే ఖర్చు రూ.20 లక్షలు (గతంలో ఇది రూ.2.24 లక్షలు)
- పోలీస్ అమర వీరుల వారోత్సవాలకు రూ. 10 లక్షలు కేటాయించారు. (గతేడాది ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు)
- నూతన పోలీస్ స్టేషన్ల నిర్వహణకు రూ. 5 కోట్లు (గత ఏడాది రూ. 12.54 కోట్లు కేటాయించారు)

సైబరాబాద్‌లో..

- కమిషనరేట్ నిర్వహణకు రూ. 12.36 కోట్లు
- ట్రాఫిక్ విభాగానికి రూ. 2.65 కోట్లు
- పండగల బందోబస్తుకు రూ. 2.10 కోట్లు
- సీసీఎస్, ఎస్‌వోటీ విభాగాలకు రూ. 1.41 కోట్లు
- మహిళల భద్రతకు రూ. 33 లక్షలు
- స్పోర్ట్స్ మీట్‌కు రూ. 35 లక్షలు

రాచకొండలో..

- కమిషనరేట్ నిర్వహణకు రూ. 9.40 కోట్లు
- కార్యాలయ నిర్వహణకు రూ. 7.46 కోట్లు
- ట్రాఫిక్ విభాగానికి రూ. 60 లక్షలు
- పండగల బందోబస్తుకు రూ. 75 లక్షలు
- సీసీఎస్, ఎస్‌వోటీ విభాగాలకు రూ. 5.50 లక్షలు
- మహిళా భద్రతకు రూ. 11.20 లక్షలు
- సీసీటీవీల నిర్వహణకు రూ. 25 లక్షలు
- స్పోర్ట్స్ మీట్‌కు రూ. 3.20 లక్షలు
- రాచకొండ కమిషనరేట్ భవన నిర్మాణానికి రూ. లక్ష

కొత్తగా ఏర్పాటైన పోలీస్ స్టేషన్ల నిర్వహణ, నిర్మాణం, మౌలిక సదుపాయాలకు బడ్జెట్ కేటాయించలేదు.

రాష్ట్ర బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే..



నిజాంపేట్/గాజులరామారం/చందానగర్/బాలానగర్, జూలై, 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్‌వాసులు మిశ్రమంగా స్పందించారు. పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, ప్రొఫెసర్లు, వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే...

సబ్బండ వర్గాలకు న్యాయం చేసే విధంగా..



సబ్బండ వర్గాలకు న్యాయం చేసే విధంగా తెలంగాణ బడ్జెట్ ఉంది. హైదరాబాద్ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించడం హర్షనీయం. ఆరు గ్యారంటీల అమలుతో పాటు పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఈ బడ్జెట్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

\- కూన శ్రీశైలంగౌడ్, మాజీ ఎమ్మెల్యే

బడ్జెట్ కేటాయింపులు బాగున్నాయి



రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ చాలాబాగుంది. విద్య, వైద్యం, వ్యవసాయం, స్త్రీ, శిశు సంక్షేమ రంగాలకు బడ్జెట్ కేటాయింపులు బాగున్నాయి.

\- కె.మోహనరావు, విశ్రాంత వైద్యాధికారి ప్రగతీనగర్

రైతులకు పెద్దపీట



బడ్జెట్‌లో రైతులకు పెద్దపీట వేశారు. జైజవాన్.. జైకిసాన్ అనే నినాదాన్ని నమ్మే కాంగ్రెస్ పార్టీ రైతులను రాజులను చేసే విధంగా ముందుకెళ్తోంది.

\- సాంటిరెడ్డి పున్నారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి

మెట్రోరైలు పొడిగింపు హర్షణీయం



నగరాభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించడం హర్షనీయం. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు మెరుగైన ప్రజా రవాణా కల్పించేందుకు పెద్దపీట వేశారు. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రోరైలు పొడిగిస్తామని ప్రకటించడం హర్షణీయం.

\- రామస్వామియాదవ్, సామాజిక కార్యకర్త

ఎస్సీ సంక్షేమానికి ప్రాధాన్యం



బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ నిధులు కేటాయించడం హర్షణీయం. తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

\- కర్క నాగరాజు, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం గ్రేటర్ అధ్యక్షుడు

విద్య, వైద్యరంగానికి ప్రాధాన్యం



బడ్జెట్‌లో విద్య, వైద్యరంగానికి ప్రాధాన్యమిచ్చారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచుతూ నిధులు కేటాయించడం అభినందనీయం. వైద్యరంగంలో మరిన్ని మార్పుల కోసం పరిశోధక పరికరాల కొనుగోలు విషయం బడ్జెట్‌లో ఉంటే బాగుండేది.

\- కెప్టెన్ రవీంద్రకుమార్

వ్యవసాయ రంగానికి రెట్టింపు బడ్జెట్



వ్యవసాయ రంగానికి రెట్టింపు బడ్జెట్ కేటాయించడం హర్షనీయం. పంటకు గిట్టుబాటు ధరతో పాటు సరైన మార్కెటింగ్ వ్యవస్థ, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు సరైన సమయంలో అందిస్తే లాభసాటిగా ఉంటుంది. నూతన వంగడాలు, సహజసిద్ధ వ్యవసాయాన్ని ప్రోత్సహించే ప్రణాళికను రూపొందించి అమలు చేయాలి.

\- కృష్ణారెడ్డి, హెచ్‌సీయూ ఆర్థిక ఆచార్యులు

విద్యారంగానికి మరిన్ని నిధులు కేటాయిస్తే బాగుండేది



విద్యారంగానికి భారీగా కేటాయింపులు జరుగుతాయని ఆశించిన వారిని బడ్జెట్ నిరుత్సాహ పరిచింది. పాఠశాలల్లో కనీస సదుపాయాలు కలిపించేందకు మరిన్ని నిధులు కేటాయిస్తే బాగుండేది.

\- ఉరిటి వెంకట్రావ్, బిల్డర్



బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్లు శ్రావణ్‌కుమార్, బాబురావు



బోనాల వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ తదితరులు

మూసాపేట్‌లో బోనాల వేడుకలు

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మూసాపేట్‌లోని పోచమ్మ తల్లి, మహంకాళి సరస్వతి దేవస్థానంలో బోనాల ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తజనం తెల్లవారుజాము నుంచే అమ్మవార్లను దర్శించుకొని, బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, పగుడాల బాబురావు బోనాల వేడుకల్లో పాల్గొన్నారు.

పోచమ్మ కల్యాణోత్సవం

పేట్‌బషీరాబాద్, జూలై, 25(ఆంధ్రజ్యోతి): కొంపల్లి పురపాలక సంఘంలోని శ్రీ పోచమ్మ దేవాలయంలో గురువారం కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో కొంపల్లి పురపాలక సంఘం సన్నా శ్రీశైలంయాదవ్ కవిత దంపతులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మ ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నారు.



అమ్మవారిని దర్శించుకున్న కాంగ్రెస్ కూకట్‌పల్లి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగంను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



నాగదేవతకు పూజలు చేస్తున్న శ్రీశైలంయాదవ్ కవిత దంపతులు

నేటి నుంచి భెల్‌లో బోనాల ఉత్సవాలు

భెల్‌కాలనీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రారంభం కానున్న ఆషాఢ బోనాల ఉత్సవాలకు బీహెచ్‌ఈఎల్ పెద్దమ్మతల్లి దేవాలయాన్ని సర్వాగసుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించడంతో పాటు ఆలయ ప్రాంగణంలో భారీ వేదికను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు పారిశుధ్య నిర్వహణ పనులను పూర్తి చేసినట్లు తెలిపారు.

ఈ ఏడాది అమ్మవారికి రూ. 50లక్షల వ్యయంతో తయారుచేయించిన బంగారు చీరను అలంకరించనున్నారు. పెద్దమ్మతల్లి దేవాలయంలో బోనాల ఉత్సవాల నేపథ్యం శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ప్రతిరోజూ నిత్యపూజలు, ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, సాంస్కృతిక, సాహిత్య, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం భెల్ ఈడీ, అధికారులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి ఉత్సవాలను ప్రారంభిస్తారు. ఆదివారం కాలనీ పురవీధుల్లో అమ్మవారి రథోత్సవం నిర్వహిస్తారు.

ఆర్టీసీ బస్సుల్లో వయోవృద్ధులకు రాయితీ కల్పించాలి

పేట్‌బషీరాబాద్, జూలై, 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో వయోవృద్ధులకు టికెట్‌పై రాయితీ కల్పించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు సీనియర్ సిటిజన్స్ వినతి పత్రం అందజేశారు. గురువారం వారు జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్‌క్లేవ్‌లో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో వయో వృద్ధులకు ఆర్టీసీ బస్సుల్లో కల్పిస్తున్న రాయితీ మాదిరిగానే తెలంగాణలో కూడా అమలు అయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్‌ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేశం, కోశాధికారి మురళీ, ఉపాధ్యక్షులు లింగం, సభ్యులు నాగేష్, వీరారెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ పట్టణ మహిళా సమాఖ్య కమిటీ ఎన్నిక

కుత్బుల్లాపూర్ పట్టణ మహిళా సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఇందిరా రెడ్డి, పట్టణ మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు పద్మగౌడ్, కార్యదర్శి సత్యవాణి, సంయుక్త కార్యదర్శి కుర్షిద, కోశాధికారి శ్యామల, డైరెక్టర్లు అనిత, పద్మ, ఆసియా, లావణ్య, కల్పన, లలిత, మంగతో పాటు సభ్యులను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్‌క్లేవ్‌లో కలిశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

హైదర్‌నగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్లకు చెందిన పలువురు లబ్ధిదారులకు గురువారం తన కార్యాలయంలో ఎమ్మెల్యే గాంధీ షాదిముబారక్, కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 28మంది లబ్ధిదారులకు రూ.28,03,248 విలువైన చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్‌వ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో సీపీ ఆకస్మిక తనిఖీ

పేట్‌బషీరాబాద్, జూలై, 25(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌ను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో కేసుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలను కేసుల ఇన్వెస్టిగేషన్‌కు పంపించాలని పోలీసు అధికారులకు సీపీ సూచించారు. పక్కనే ఉన్న మేడ్చల్ డీసీపీ కార్యాలయాన్ని పరిశీలించి, డీసీపీ కోటిరెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ విజయ్‌వర్ధన్ పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

● శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి, జూలై 25(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత విషయంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది అత్యంత పకడ్బందీగా పనిచేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి సూచించారు. శిల్పారామం రోడ్డు, కొత్తగూడ కూడలి, గచ్చిబౌలి బయోడైవర్సిటీ ప్రాంతాల్లో అధికారులతో కలిసి జోనల్ కమిషనర్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా వర్షపునీరు నిలిచే ప్రాంతాలను, సెంట్రల్‌లో పచ్చదనం, పరిశుభ్రతను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు మధ్యలో మరింత పచ్చదనం పెంచాలని సూచించారు. పారిశుధ్య పనులు మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం ముగిసే వరకు ఆయా విభాగాలు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేయాలని ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా ఆరోగ్యానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ శంకర్, డిప్యూటీ ఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

'నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తే లక్ష్యం'

దుండిగల్, జూలై, 25(ఆంధ్రజ్యోతి): నైపుణ్యం కలిగిన శ్రామికశక్తిని అభివృద్ధి చేయడమే లక్ష్యమని మహేంద్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ యాజులు మేదూరి అన్నారు. గురువారం బహదూర్‌పల్లిలోని మహేంద్ర యూనివర్సిటీ ప్రాంగణంలో మహేంద్ర యూనివర్సిటీ, నేషన్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ప్రీ ఇంజనీర్డ్ స్టక్చర్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఎస్‌ఐ) మధ్య అవగాహన ఒప్పందంపై(ఎంఓయూ) సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో నిర్మాణ ఇంజనీరింగ్ విద్యలో అత్యుత్తమ స్థాయిని సాధించడానికి ఈ ఒప్పందం కీలకమైన దశను సూచిస్తుందన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ డైరెక్టర్ జనరల్ టి.మధుసూధనరెడ్డి మాట్లా డుతూ ఈ భాగస్వామ్యం ఆవిష్కరణలవైపు నడిపించగలదని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌ఐ అధ్యక్షులు ప్రసాద్, తెలంగాణ చైర్మన్ శేఖర్‌రెడ్డి, ఎన్‌సీఏ డైరెక్టర్ రాజిరెడ్డి, మహేంద్ర యూనివర్సిటీ అసిస్టెంట్ డీన్ విశాలాక్షి, మహేంద్ర యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగాల అధిపతి డాక్టర్ హరిప్రసాద్, విశ్వవిద్యాయలం స్కూల్ ఇన్నోవేషన్ డీన్ ప్రొఫెసర్ బీఏ చక్రవర్తి సీనియర్ ఫ్యాకల్టీ మురళీధర్, ఎండీ సత్యనారాయణ, ప్రొఫెసర్ కామేశ్వరరావు, పద్మాజా గోకరాజ్, ఎండీలు రాజ్‌కుమార్, సురేష్, సెక్రటరీ రాంబాబు ఉన్నారు.

పేపర్లలో వచ్చిన కథనాలను సర్క్యులర్ చేయొద్దు

● 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల్లో హైరానా?

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ మూసాపేట్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై ప్రజలు, అసోసియేషన్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు.. ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు' అనే శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సోషల్ మీడియా, అధికారులు, ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాల వాట్సాప్ గ్రూపుల్లో చక్కెర్లు కొట్టడంతో ఉన్నతాధికారులు అలర్ట్ అయినట్లు తెలిసింది. 'త్వరలోనే బదిలీల్లో మేం వెళ్లిపోతున్నాం.. అప్పటి వరకు అయినా ఇటువంటి వాటిని సర్క్యులర్ చేయొద్దు'అని కింది స్థాయి సిబ్బందిని ఆదేశించారని సమాచారం. 'తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే మీకే నష్టం.. మేం వెళ్లిన తర్వాత మీ జాతకం, మీ వ్యవహార శైలి ఇక్కడికి వచ్చిన వారికి చేరవేస్తాం' అని సిబ్బందిని హెచ్చరించారట. జోనల్ కమిషనర్, ఐఏఎస్ అధికారి అపూర్వ్ చౌహాన్ అక్రమ నిర్మాణాలపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి.

నాలుగు ఎస్టీపీలను ఎప్పుడు పూర్తి చేస్తారు?

● బీజేపీ నాయకుడు సతీష్

దుండిగల్, జూలై, 25(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గత ప్రభుత్వం ఆరు ఎస్టీపీల నిర్మాణానికి శంకుస్థాపన చేయగా రెండు మాత్రమే పూర్తయ్యే దశలో ఉన్నాయని, మిగతా నాలుగింటి పరిస్థితి ఏమిటని బీజేపీ నాయకుడు ఆకుల సతీష్ ప్రశ్నించారు. గురువారం వెన్నెలగడ్డలో ఎస్టీపీ ప్లాంట్ వద్ద బీజేపీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెన్నెలగడ్డ, శివాలయనగర్‌ల్లో ఎస్టీపీ పనులు పూర్తి అయ్యే దిశలో ఉన్నాయని, అంబీర్‌చెరువు వద్ద ప్రారంభ దశలో, మిగిలిన మూడు ప్రారంభించలేదన్నారు. ఈ విషయమై ముఖ్య మంత్రి కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు అరుణ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, స్వామి ఉన్నారు.

నకిలీ పత్రాలతో ప్లాట్ రిజిస్ట్రేషన్.. ఇద్దరికి రిమాండ్

దుండిగల్, జూలై, 25(ఆంధ్రజ్యోతి): ప్లాట్‌కు నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాచుపల్లి పోలీసులు తెలిపిన ప్రకారం.. కొండాపూర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న లాగిశెట్టి జయశ్రీ(56) ప్రగతినగర్‌లోని వాసవీ లేఅవుట్ సెక్టార్-4లో సర్వే నంబరు 160/పీ,182/పీ, 159/పీలో ప్లాట్ నంబరు 135లో 244 గజాల స్థలం ఆమెకు ఉన్నది. ఈ ప్లాట్‌కు సంబంధించి సరాయి కృష్ణ, కమ్మరి కుమార్ కలిసి నకిలీ పత్రాలను సృష్టించారు. ప్లాట్‌ను సరాయి కృష్ణ పేరుపై మార్చి రిజిస్ట్రేషన్ చేశారు. జయశ్రీ ఆన్‌లైన్‌లో ఈసీ తీసుకోగా తన ప్లాట్ కృష్ణ పేరుపై ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ ఆఫీసులో రిజిస్టరును కలిసి విషయం చెప్పగా నకిలీ పత్రాల ఉదంతం వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, వారిద్దరిని రిమాండ్‌కు తరలించారు.

ఇళ్లలో చోరీలు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

అల్లాపూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చోరీ చేస్తున్న వ్యక్తిని అల్లాపూర్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట సోమయ్యనగర్‌కు చెందిన కొల్లిపాకల మణికంఠ (21) కేటరింగ్ పని చేస్తుంటాడు. అల్లాపూర్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో పగటిపూట తిరుగుతూ తాళాలు లేని ఇళ్లను గుర్తించి కిటికీ ద్వారా లోపలికి ప్రవేశిస్తాడు. బీరువాలోని బంగారు ఆభరణాలు దోచుకుని వెళ్లిపోతాడు. ఇలా దొంగిలించిన విలువైన వస్తువులను విక్రయించి వచ్చిన డబ్బుతో బెట్టింగ్, జల్సాలకు ఖర్చుచేస్తాడు. గురువారం మణికంఠ అల్లాపూర్‌లోని గాయత్రినగర్ క్రాస్ రోడ్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అల్లాపూర్, కూకట్‌పల్లిలో ఇటీవల రెండు దొంగతనాలు చేసినట్లు మణికంఠ అంగీకరించాడు. నిందితుని వద్ద నుంచి రూ.4.8 లక్షల విలువచేసే ఎడున్నర తులాల బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

30 రోజుల్లో 345 ఫోన్‌ల రికవరీ

హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ ఐటీ సెల్, సోషల్ మీడియా సిబ్బంది కలిసి నెల వ్యవధిలోనే 345 ఫోన్‌లు రికవరీ చేశారని సైబరాబాద్ సైబర్ క్రైం డీసీపీ కె.నరసింహ తెలిపారు. కమిషనరేట్ పరిధిలో చోరీ చేసిన, పోగొట్టుకున్న ఫోన్‌లు రికవరీ చేసి, కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాటిని సంబంధిత యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం డీసీపీ నరసింహ మాట్లాడుతూ ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా, చోరీ జరిగినా వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి సీఈఐఆర్) పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

లైంగికంగా వేధించిన ప్రోగ్రామ్ ఆఫీసర్ తొలగింపు

హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో లైంగిక వేధింపులకు పాల్పడిన జీహెచ్ఎంసీ స్వచ్ఛ భారత్ మిషన్ విభాగంలోని ప్రోగ్రామ్ ఆఫీసర్‌ను విధులను నుంచి తొలగించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జీహెచ్ఎంసీ స్వచ్ఛ భారత్ మిషన్ విభాగంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సోమ భరత్ జీహెచ్ఎంసీలో ఓ మహిళా ఉద్యోగిని ప్రేమ పేరుతో వేధించాడు. విసుగు చెందిన బాధితురాలు రెండు వారాల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి భరత్‌ను అరెస్టు చేశారు. రిమాండ్‌కు తరలించారు. ఈ విషయం కమిషనర్ ఆమ్రపాలి దృష్టికి రావడంతో మూడు రోజుల క్రితం భరత్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. సోమ భరత్ తీరు వల్ల ఆ విభాగంలో పనిచేసే దాదాపు 30మంది మహిళలు తమ ఉద్యోగాలు కోల్పోయినట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

'డివైడర్‌ల పనులను త్వరగా పూర్తి చేయాలి'

పేట్‌బషీరాబాద్, జూలై, 25(ఆంధ్రజ్యోతి): కొంపల్లి ఎన్‌హెచ్-44 రహదారి నుంచి దూలపల్లి వెళ్లే రోడ్డు విస్తరణలో భాగంగా ఏర్పాటు చేస్తున్న డివైడర్ల పనులు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కో-కన్వీనర్ శివాజీ రాజ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్‌సాగర్ అన్నారు. గురువారం వారు నిలిచిపోయిన డివైడర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలు జరగక ముందు డివైడర్ పనులు త్వరగా పూర్తి చేసేలా అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

'అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించాలి'

హైదర్‌నగర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్‌లో అక్రమ తాగునీటి కనెక్షన్లు తొలగించి అందరికీ సక్రమంగా నీరు సరఫరా చేయాలని వాటర్‌వర్క్స్ డీజీఎం నాగప్రియకు బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్, అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు వినతి పత్రం అందజేశారు. గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్ కాలనీలో వారు పర్యటించి, స్థానిక సమస్యలను పరిశీలించారు.